54

# బోడి పెత్తనం బొమ్మలాట

"నేను చాలా మొండి ముండాకొడుకును ఏదన్నాపని మొదలు పెట్టకుండానే వుండాలి - మొదలు పెట్టాననుకోండి, దాని అంతు చూసిందాకా వదలను, దాని చావో, నా చావో తేలాల్సిందే. ఇప్పటికి ముప్పయి పన్లు చేశాను. ఇది ముప్పయిరెండో పని. దీన్ని కూడా ఎప్పుడు మానేస్తానో చెప్పలేను. దీన్నే ఇంకో పది కాలాలపాటు అంటి పెట్టుకొని వుంటానేమో అంతకన్నా చెప్పలేను". అన్నాడు కేశవులు సిగరెట్టు కాలుస్తూ.

అతని వేషం చూస్తే అలా అనిపించదుగానీ మాట ధోరణి చూస్తే రవంత గట్టివాడేననిపించింది.

పుట్టినవూరు, చిన్నప్పటి సంగతులు, అమ్మనాన్నల వివరాలూ అడిగినప్పుడు కేశవులు చిరాకుపడ్డాడు. "మీరు పోలీసులు కాదుగదా! ఈ గొడవలన్నీ ఎందుకండీ మీకు? ఈ ముండమోపి దేశంలో ఏవూరయితేనేమండీ బాబూ అన్ని ఊళ్ళూ వల్లకాడుల్లాగే ఉన్నాయి. మనిషన్న తరువాత , ఏదో ఒక వూళ్ళో, ఎప్పుడో ఒకప్పుడు తప్పదుగదా? మరింక ఆ సంగతులు ఎత్తకండి, ఆ వూరన్నా, అక్కడి మనుషులన్నా నాకు పరమ అసహ్యం. అమ్మానాన్నల సంగతి అడిగారు. వాళ్లు బతికే వున్నారు. రెండేళ్ళకో మూడేళ్ళకో వెళ్ళి చూసొస్తుంటా. వాళ్ళ పేర్లు మీరు అడగనూ కూడదు. నేను చెప్పనూకూడదు. మీరు మరీ బలవంతం చేస్తే, అసలు చెప్పడమే మనేస్తా. అమ్మా నాన్నల పేర్లు అబద్ధం చెప్పటం నాకిష్టంలేదు. నిజం చెప్పి వాళ్ళ పరువును నట్టేట్లోముంచడం అంతకన్నా ఇష్టం లేదు. కనుక బాబుగారు, నన్ను పదే పదే గీమారబాకండి" అన్నాడు కేశవులు చిన్నదయిపోయిన సిగరెట్టుకు మరో సిగరెట్టు అంటిస్తూ.

అతను ఎనిమిద్దాకాలో, తొమ్మిద్దాకానో చదువుకొన్నాడట. పరీక్ష పాసుకాలేదుట. "ఎందుకవుతానో ఎలా అవుతానో చెప్పండి? చీకటితో లేవాలి. గొడ్ల దగ్గర పేడదీయాలి. కొట్టం వూడవాలి. గుళ్ళో బావి నుండి పాతిక్కావిళ్ళ నీళ్లు మొయ్యాలి. పచ్చడో, గిచ్చడో వేసుకొని ఇంత సద్దో గిద్దో ఆదరా బాదరా నోట కుక్కుకుని బడికి పోవాలి. అక్కణ్ణుంచి స్కూలుకు రాని పిల్లల్ని పిలవడానికి ఊరంత తిరగాలి. అయ్యవారు రోజూ నన్నే పంపేవారు. చదువు పీడా తప్పుతుందని నేను కూడా బలాదూరు తిరిగొచ్చేవాణ్ణి పంతులుగారు నన్నే ఎందుకు పంపేవారో, నాకప్పుడు తెలిసింది కాదు. ఇప్పుడు గ్రహించాననుకోండి. లాభం లేదు గదా. మళ్ళా సాయంత్రం నీళ్ళమోత, గొడ్లకు మేత వేయడం, చొప్ప అయిపోతే వామిదగ్గరకు నేనే వెళ్ళి తీసుకురావాలి. దాన్ని నేనే నరకాలి. నేనే వేయాలి. ఇంత చండాలం మధ్య, చదువెలా సాగుతుందో చెప్పండి? ఇంతకన్నా బాధలుపడి, చదువుకొన్న మహానుభావులూ ఉన్నారనుకోండి. నేను మహానుభావుణ్ణి కాదు బాబోయ్. చాలా మామూలు వాణ్ని, ఈ దేశంలో వున్న లక్షమంది బోడి సన్నాసుల్లో నేనొక సన్నాసిని. అందుకనే ఇలా సన్నాసిగా బతుకుతున్నా" అన్నాడు కేశవులు.

అతను చాలా పనులు చేశాడు. సోడా అమ్మడం, ఐస్‌క్రీం అమ్మడం, రిక్షా తొక్కడం, రేస్ పుస్తకాలు అమ్మడం, ప్లాస్టిక్ ఫ్యాక్టరీలో పనిచేయడం, సినిమా హాల్లో సైకిళ్ళకు కాపలా ఉండడం, వడ్డీ వ్యాపారస్తుని వద్ద దాదాగా పనిచేయడం, కలప అడితీలో కోతపని చేయడం ఇంకా సవాలక్ష పనులు చేశాడు.

“నేను సోమరిపోతును కానండీ, కానీ కావాలనే నేను సోమరితనాన్ని అలవాటు చేసుకొన్నాను. పది రూపాయలున్నాయనుకోండి, పనిచేయబుద్ధిగాదు. ఆ పదీ అయిపోవాలి ఆ తరువాత అప్పు చేస్తాను. నాకూ ఐదు పదీ అప్పులిచ్చే వాళ్ళున్నార్లెండి. అప్పుకూడా పుట్టనప్పుడు పస్తులుంటాను. ఇక పస్తులుండలేనని తోచినప్పుడు మళ్ళా ఏదో పని లంకించుకొంటాను... చేస్తాను.

నాలుగు పిచ్చికలు సంపాదించుకొంటాను ఇదీ తంతు. ఈ పని మాత్రమే చెయ్యాలని నాకు పట్టింపు లేదు. ఏదయినా చేస్తా నాకభ్యంతరం లేదు” అన్నాడు కేశవులు.

ఒక చోట కుదురుగా వుండాలని గానీ, జీవితంలో స్థిరపడాలని గానీ తనకు లేనేలేదన్నాడు. అప్పుడప్పుడు పేకాట ఆడతానన్నాడు. ‘పులిజూదం’ ఆటలో తను వోడిపోవడమంటూ ఇంతవరకూ జరగలేదన్నాడు. తాగుతాననీ తందనాలాడతాననీ అన్నాడు.

“గజమొండిని గనకా మీరంటే నాకు భయంలేదు గనకా, కత్తితో కోసినట్లు చెబుతున్నానండీ! మీరు మాత్రం తాగరా?” అన్నాడు కేశవులు సమాధానం విని అతనూ ఫకాలున నవ్వాడు.

“మీలాంటి వాళ్ళ సంగతి పోనీండి నేను తాగుతా. మీలాంటి వాళ్లూ నాకన్నా చెడతాగుతారు. ముండాముతకతో తిరుగుతారు. మీ యిష్టమొచ్చిన క్లబ్బుకో, బారుకో వెళ్ళి చూడండి. మీ వంటి వాళ్ళక్కడ బోలెడు మంది కనపడతారు. వాళ్లకు లేని బిడియం, తప్పు నాకెందుకండీ? ఒకసారి మీరేమి అనుకోకండి సార్ - నెల రోజుల పాటు ‘వి.డి’ వార్డులో ఉన్నాను” అన్నాడు కేశవులు.

తనచుట్టూ ముసిరిన సమాజం మీద గల ద్వేషాన్ని తీర్చుకునే మార్గం లేక, ఆ కసిని తనమీద తనే తీర్చుకుంటున్నాడేమోననిపించింది. “ఈ బిజినెస్ వాటంగానే ఉందండీ! ఈ పాత్రలైనా నావి కదండీ. ఒక సేట్ కొనిచ్చాడు. నేను పాత గుడ్డలకు వీటిని అమ్ముతాను. ఈ రోజుల్లో చినిగిన వాటిని నలిగిన వాటిని కట్టుకునేవారే లేరండి. కాస్త చినిగిందనుకోండి, కొంౖరుపట్టిందనుకోండి, ఏ మడత దగ్గరో పీచురేగిందనుకోండి, అవతల పారేస్తారు. అదిగో - అలా పారేసేవారే నాకు కావాలి. ఓ పల్చటి స్టీల్ గిన్నెకు రెండుపాంట్లు పడేసి పుచ్చుకుంటుంటా. గిన్నె ఖరీదు 10, 15కు మించి ఉండదు పాంట్లు ఖరీదు... అయ్యా! అలా బతుకును ఈడ్చుకొస్తున్నా. నాకు పెళ్ళాం లేదు. పెళ్ళే కాలేదు సార్! ఉన్నదంతా ఖర్చు చేస్తా. అయిపోతే, మళ్ళీ సంపాదిస్తా, సంపాదించడం చాతకానివాడికి భయం. సక్రమంగా బతకలేననుకోండి. మాయచేసి బతుకుతా... అదిగో! మళ్ళీ మీరా ప్రశ్నలడక్కూడదు. నేను చెప్పకూడదు... నేనెక్కడుంటానని మీరొస్తారండీ?” అన్నాడు కేశవులు. ఈ మధ్యనే విడుదలైన ఓ తెలుగు సినిమాలోని బూతు పాటను ఈలమీద పాడుతూ.